ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



2



2

బంగారం కోసం మేనకోడలి హత్య



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## తెయూ డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

**అక్షరటుడే, ఇందల్వాయి :** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. డిగ్రీ (సీబీసీఎస్) ఒకటో, మూడో, ఐదో, సెమిస్టర్ రెగ్యులర్, రెండో, నాల్గో, ఆరో, సెమిస్టర్ బ్యాక్ లాగ్ థియరీ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజు బుధవారం ఉదయం జరిగిన పరీక్షలకు 1,671 మంది విద్యార్థులకు గాను 1,545 మంది విద్యార్థులు హాజరయ్యారు. 125 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 5,140 మంది విద్యార్థులకు గాను, 4,916 మంది విద్యార్థులు హాజరయ్యారు. 224 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. కాగా.. నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ లో ఓ విద్యార్థి డిబార్ అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.





## నీలకంఠేశ్వరాలయంలో పీసీసీ అధ్యక్షుడి ప్రత్యేక పూజలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ నగరంలోని నీలకంఠేశ్వ రాలయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయం పరిసరాలను సందర్శించారు. ఆలయ వైభవం, అభివృద్ధి వివరాలను అర్చకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు.. టీపీసీసీ చీఫ్‌కు ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. పూర్ణకుంభంతో సత్కరించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## బీటీ, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలోని పలు వార్డుల్లో బీటీ, సీసీ రోడ్లకు బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 27 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్న పనులకు అంగడి బజార్‌లో శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, కాంగ్రెస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ ఛైర్మన్ సాయిబాబా గౌడ్, నాయకులు పండిత్ పవన్, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కేవోఎస్ విద్యార్థిని



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్‌లో గల కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థిని వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న దీక్షిత జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో రాణించింది. దీంతో విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. కాగా.. విద్యార్థి దీక్షిత పెద్దపల్లిలో జరుగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొననుందని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినిని స్కూల్ డైరెక్టర్ రామోజీ, వైస్ ప్రిన్సిపాల్ భావన, వాలీబాల్ కోచ్ సాయిలు అభినందించారు.

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. తొలి విడత నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ఎన్నికల్లో గెలిచి పల్లెల్లో పట్టు సాధించాలని ఆయా పార్టీల నాయకులు భావిస్తున్నారు. ఈ మేరకు కసరత్తు ప్రారంభించారు. పార్టీ మద్దతుతో బరిలో దిగే అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అటు ఆశావహులతో పాటు ప్రధాన పార్టీల్లోనూ కోలాహలం నెలకొంది. పార్టీ పరంగా అభ్యర్థుల ఎంపిక కాకున్నా.. తమ మద్దతు దారులను గెలిపించుకుని బలం నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

– అక్షరటుడే, లింగంపేట/ఇందూరు



# పల్లెల్లో పట్టు కోసం..

▸ పంచాయతీ ఎన్నికల్లో మద్దతుదారులను గెలిపించుకునేందుకు రాజకీయ పార్టీల కసరత్తు ▸ గ్రామాల బాట పట్టిన నాయకులు

అధికార కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఉంది. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపుతో పార్టీలో జోష్ నెలకొంది. రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో పాటు పలు పథకాల అమలును ప్రజల్లోకి తీసుకెళ్తూ తమ మద్దతు దారులైన అభ్యర్థులను గెలిపించుకునేలా ప్రణాళిక రూపొందిస్తోంది. జిల్లాలో ఇద్దరు ప్రభుత్వ సలహాదారులతో పాటు నలుగురు కార్పొరేషన్ ఛైర్మన్లు, ఎమ్మెల్యేలు ఉండడం.. పార్టీకి బలం కానుంది. కాంగ్రెస్ మద్దతుతో గెలవాలనే ఆశావహులు సైతం అధికంగానే ఉన్నారు.

### బీఆర్ఎస్ సైతం..

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌కు ప్రస్తుతం ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం కోసం శ్రమిస్తున్నారు. పార్టీని గెలిపిస్తే భవిష్యత్‌లో తమకు మంచి పదవులు వస్తాయని నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా మోసం చేసిందని ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వ వ్యతిరేకతతో గెలుపు సాధించాలని చూస్తున్నారు.

### కామారెడ్డి జిల్లాలో పంచాయతీలు..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలు, 4,656 వార్డులు ఉన్నాయి. జీపీల్లో జనరల్‌కు 240, బీసీలకు 123, ఎస్టీ 90, ఎస్సీలకు 79 కేటాయించారు. అలాగే వార్డులకు సంబంధించి జనరల్ 2,085, బీసీ 1,117, ఎస్సీ 732, ఎస్టీలకు 722 కేటాయించారు.

### కమలంలో జోష్

ఉమ్మడి జిల్లాలో బీజేపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్నారు. దీంతో మెజారిటీ సర్పంచ్ స్థానాల్లో గెలుపొంది రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సిద్ధం కావాలని పార్టీ యోచిస్తోంది. ఈ మేరకు ఎమ్మెల్యేలు చర్యలు చేపట్టారు. సీనియర్ నేతలతో చర్చిస్తున్నారు. గెలుపు గుర్రాలకు టికెట్లు ఇచ్చి విజయం సాధించాలని చూస్తున్నారు.

### పల్లెబాట పట్టిన నాయకులు

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అన్ని పార్టీల నాయకులు పల్లెబాట పట్టారు. ఇదివరకే గ్రామాల్లో శుభకార్యాలకు, చిన్న చిన్న ఫంక్షన్లకు హాజరై, పరామర్శలు చేస్తూ ఓటర్లను ఆకర్షిస్తున్న నాయకులు ప్రస్తుతం పల్లెపోరులో గెలుపే లక్ష్యంగా సాగుతున్నారు. బలమైన అభ్యర్థిని బరిలో నిలపడానికి గ్రామాల్లో పర్యటిస్తున్నారు. పార్టీ శ్రేణులతో చర్చిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల నేతలు తమ వారిని నిలబెట్టి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇదివరకే ఆయా గ్రామాల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పార్టీ నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అందులో బలమైన అభ్యర్థిని పోటీలో నిలపనున్నారు.

### నిజామాబాద్ జిల్లాలో

నిజామాబాద్ జిల్లాలో 545 గ్రామపంచాయతీలు, 5022 వార్డులు ఉన్నాయి. జనరల్‌కు 242, ఎస్టీలకు 96, ఎస్సీలకు 82, బీసీలకు 125 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. అలాగే మొత్తం 5,022 వార్డు స్థానాల్లో జనరల్ 2,271, ఎస్టీ 836, ఎస్సీ 808, బీసీలకు 1,107 స్థానాలను కేటాయించారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



**అక్షరటుడే, ఇందూరు:** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని సూచించారు. జిల్లా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా అప్డేట్ చేసిన రిజర్వేషన్లు.. ఏ విడతలో పోలింగ్ ఉంటుంది.. పోలింగ్ కేంద్రాల జియో లోకేషన్ తదితర వివరాలు వెంటనే టీ పోల్ వెబ్‌సైట్, యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే వీటిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో నోడల్ అధికారి నియమించాలని సూచించారు. ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలని తెలిపారు. నవంబర్ 23న విడుదల చేసిన ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాలను అనుసరిస్తూ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, తాగునీరు, మూత్రశాలలు తదితర కనీస వసతులు ఉండేలా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సంబంధిత తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థుల జాబితా, అప్పీల్స్, ఉపసంహరణ అన్ని సజావుగా సాగేలా చూడాలని చెప్పారు. జిల్లాలో ఉన్న ప్రింటర్లకు అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార కరపత్రాల ముద్రణ చేయకూడదంటూ ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన


**అక్షరటుడే, కామారెడ్డి:** జనం బాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ, జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. నిజాంసాగర్, నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్‌లను సందర్శించనున్నారు. బాన్సువాడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, నాగిరెడ్డిపేట మండలంలో ముంపు రైతులతో సమావేశమవుతారు. చరిత్రాత్మక నాగన్న బావిని సందర్శిస్తారు. తాడ్వాయిలోని శబరిమాత ఆశ్రమాన్ని సందర్శించనున్నారు. కామారెడ్డి పట్టణంలో కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి నివాళులర్పిస్తారు.

## మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు : సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీపీ సాయిచైతన్య హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. మోటర్ వెహికల్ అమెండ్‌మెంట్ యాక్ట్ ప్రకారం డ్రంకన్ డ్రైవ్‌లో మొదటి సారి పట్టుబడితే కోర్టులో రూ. 10వేల జరిమానా లేదా ఆరు నెలల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని పేర్కొన్నారు. ఇక రెండో సారి పట్టుబడిన వారికి రూ.15వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష పడతాయన్నారు. లేదంటే రెండు కూడా విధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



**అక్షరటుడే, బీర్కూర్ :** బీర్కూర్‌లోని వైఎస్సార్ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయాలని గంగపుత్ర సంఘ సభ్యులు బుధవారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కాలనీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడంతో వర్షాకాలం వస్తే కాలనీ మొత్తం మురికి నీటితో నిండిపోతుందన్నారు. రోడ్లు బాగా లేకపోవడంతో కాలనీలోకి వాహనాలు రాలేని పరిస్థితి ఉందన్నారు.




## పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 25 మండలాల్లో 532 గ్రామ పంచాయతీలు ఉండగా.. 4,656 వార్డులు ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 4,670 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. నామినేషన్ స్వీకరణ కోసం 213 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం 213 మంది రిటర్నింగ్ అధికారులు, 213 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, రెండో విడత ఎన్నికలకు 640 మంది రిటర్నింగ్ అధికారులు, 18 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 2,869 మంది ప్రిసైడింగ్ అధికారులు, 3,771 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు పోలీస్ శాఖ తరపున భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న చెక్ పోస్టులకు అదనంగా మరిన్ని చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

## పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో భారత రాజ్యాంగ ప్రవేశిక కార్యక్రమం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** భారత రాజ్యాంగ దినోత్సవానికి బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు పోలీస్ కమిషనర్లు భారత రాజ్యాంగ ప్రవేశిక కార్యక్రమం చేపట్టారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు.. అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వారెడ్డి, అదనపు డీసీపీ (ఏఆర్ ) రాంచందర్ రావు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీలు రాజ్యాంగ ప్రవేశిక గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తిరుపతి (వెల్ఫేర్), సతీశ్ (హోంగార్డ్స్), ఆఫీస్ సూపరింటెండెంట్లు, బషీర్, భరోసా సెంటర్ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, సీసీఆర్‌బీ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూం, ఐటీ కోర్ సిబ్బంది, కమ్యూనికేషన్స్ సిబ్బంది, హోం గార్డ్స్, సిబ్బంది పాల్గొన్నారు.








## దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివస్ ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పిలుపునిచ్చారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కేసీఆర్ దీక్షను చేపట్టారని గుర్తు చేశారు. దశాబ్దాల కాలం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, బోధన్ నాయకురాలు అయేషా ఫాతిమా, మాజీ మేయర్ దండు నీతో కిరణ్ శేఖర్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, నగర అధ్యక్షుడు రాజు, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై కేసు నమోదు చేయాలి

**అక్షరటుడే, ఇందూరు :** కబ్జాలు, మొరం, ఇసుక దందాలు రౌడీయిజం పెంచుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పై కేసు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీసీపీ బస్వారెడ్డి ని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇటీవల పాల్దా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో.. సన్న బియ్యం, ఉచిత విద్యుత్తు కాంగ్రెస్సే ఇస్తున్నట్లు అసత్య ప్రచారం చేశారన్నారు. దీంతో అక్కడే ఉన్న యువకులు వీటిని కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని చెప్పారన్నారు. ఈ క్రమంలో సదరు యువకులపై కొందరితో దాడి చేయించారన్నారు. కబ్జాలు, మొరం దందా చేస్తున్న నాయకులను వెంటపెట్టుకొని ఎమ్మెల్యే దాడులు చేయిస్తున్నారని వివరించారు. జిల్లా పోలీస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెంటనే స్పందించి ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిజామాబాద్ రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, నాయకులు జగన్ రెడ్డి, ప్రమోద్, శంకర్, అధికార ప్రతినిధి శంకర్ రెడ్డి, ఆనంద్, విజయ్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ లబ్ధిదారు గృహ ప్రవేశానికి నేతల హాజరు



**అక్షరటుడే, బాల్కొండ :** మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారు రాజు గృహప్రవేశ మహోత్సవానికి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి కలిసి హాజరయ్యారు. గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న నేతలు, సంక్షేమ పథకాల ప్రయోజనం మరింత మందికి చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఎస్జీ ఎఫ్ స్కేటింగ్ జిల్లా క్రీడాకారులు ఎంపిక

**అక్షర టుడే, ఇందూరు:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ స్కేటింగ్ రింక్‌లో గురువారం ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని బరంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్ రాంచందర్ పాల్గొన్నారు.



## ఘనంగా కండెరాయుడి కల్యాణోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం కండెరాయుడు మల్లన్న కల్యాణోత్సవాన్ని వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్చకులు కల్యాణ వేడుకను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీడీసీ అధ్యక్షుడు మగ్గిడి సూర్య మాట్లాడుతూ.. డిసెంబర్ 7న మొదటి రథోత్సవం, డిసెంబర్ 14న రెండో రథోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మార్గశిర మాసంలో సుబ్రహ్మణ్య షష్ఠి ని పురస్కరించుకుని ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సుబ్రమణ్య స్వామి ఆలయం లో భక్తులు బుధవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి వల్లి దేవసేనలతో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టిని స్కంద షష్ఠి అని కూడా అంటారని ఆలయ పండితులు శ్రీనివాస్ శర్మ తెలిపారు. ఈ రోజున భక్తి శ్రద్ధలతో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆరాధిస్తే కోరికలు నెరవేరుతాయని, ఆపదలు తొలగిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గురు స్వాములు చంద్రం, కృష్ణారెడ్డి, రాజేంద్రనాథ్, కల్యాణ మహోత్సవం నిర్వహించిన సుగుణాకర్ దంపతులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు



**అక్షరటుడే, బోధన్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుండడంతో బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు శిక్షణ ఇచ్చారు. బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో.. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి, అదనపు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అవసరమైన సామాగ్రి అందజేశారు. బోధన్ డివిజన్‌లోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని ఎన్నికల అధికారులకు అప్పజెప్పినట్లు డీఎల్పీవో తెలిపారు. సమావేశంలో బోధన్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కిషోర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో..

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు.

–అక్షరటుడే, నెట్‌వర్క్




మెండోరా మండలంలో..



బాన్సువాడలోని సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో..



పాల్వంచ గ్రామంలో..



ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..




కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్ పాఠశాలలో..



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో..



బాన్సువాడలో..



బాల్కొండలో..



ఆర్మూర్‌లో..





## బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు

**అక్షరటుడే, ఇందూరు :** బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సారయ్య, వారి బృందంపై చర్యలు తీసుకోవాలని ఇందూరు గాయత్రి బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఏసీపీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యజ్ఞోపవీత ధారణ గురించి, కట్టుబొట్టు గురించి అవమానిస్తూ మాట్లాడడం సమంజసం కాదన్నారు. బ్రాహ్మణ జాతిని హేళన చేస్తూ మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు అజయ్ సంగ్వాయి, కృష్ణమాచారి, సుభాష్ శర్మ, రమేశ్ కులకర్ణి, సాయి ప్రసాద్, లక్ష్మీనారాయణ భరద్వాజ్, జయంత్రావ్, రాజ కాంతారావు, ఉమామహేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను కలిసిన నేతలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, కామారెడ్డి డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ను సన్మానించారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ.. సమిష్టిగా కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం శాయశక్తులా కృషి చేయాలన్నారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నింపుతూ, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తూ పార్టీకి విజయాలు అందించాలని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు భుజంగారి భాస్కర్ రెడ్డి, సాయి పటేల్ పాల్గొన్నారు.



## ఆలూరు పీఏసీఎస్ సీఈవోగా హన్మాండ్లు బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన సీఈవోగా హన్మాండ్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం సీఈవో హన్మాండ్లు మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, సంఘ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పారదర్శకంగా సేవలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. సభ్యులకు అవసరమైన సహకారాన్ని అందిస్తూ, సంఘాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పిప్రి పీఏసీఎస్ సీఈవో మల్లేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లారెడ్డి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సిద్ధిశ్రీధర్ ఎన్నిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సిద్ధిశ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి దిగంబర్ తెలిపారు. అధ్యక్ష పదవికి సిద్ధి శ్రీధర్, ముత్యపు కిరణ్ ఇద్దరు నామినేషన్లు వేయగా ముత్యపు కిరణ్ నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాలగేషన్, జిల్లా కార్యదర్శి ముత్యపు సుదర్శన్ తదితరులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 28న వికలాంగులకు ఆటల పోటీలు

**అక్షరటుడే, బాన్సువాడ:** కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు వికలాంగులకు ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల సమితి జిల్లా అధ్యక్షుడు కుమ్మరి సాయిలు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల వికలాంగులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. చెస్, క్యారం, షాట్ పుట్, రన్నింగ్, జావలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థి కుటుంబానికి పరామర్శ



**అక్షరటుడే, బోధన్:** చందూరు మండలం ఘన్‌పూర్ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు అవంతి కుమార్, శేఖర్ రాజు విద్యార్థి ఇంటికి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట నాయకులు కరిపె రాజు, మీసాల శంకర్, యెండల ప్రసాద్, సాయికృష్ణ, షాన్వాజ్, ఆజామ్, గోపాల్, శివ, మహిళా నాయకులు శోభా, రేఖ, సరిత తదితరులున్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలి



**అక్షరటుడే, ఇందల్వాయి:** డిసెంబర్ 14న జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. ఈ మేరకు ఇందల్వాయి మండలంలోని గన్నారంలో బుధవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దన్నారు. గ్రామంలో ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా చూడాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఇందల్వాయి ఎస్సై జి.సందీప్, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బంగారం కోసం గొంతునులిమి మేనకోడలి హత్య

**అక్షరటుడే, బోధన్ :** బంగారం కోసం మేనకోడలినే హత్య చేసిన ఘటన నవీపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆకుల అనంత అలియాస్ సోనీకి (29) గతంలో వివాహం జరిగింది. అయితే తన భర్తతో విడిపోవడంతో తల్లి ఒడ్డెమ్మతో కలిసి గ్రామంలో నివసిస్తోంది. అయితే తన మేనమామ పాండవుల సాగర్‌కు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యింది. ఇల్లు నిర్మించుకునేందుకు అనంతతో పాటు ఒడ్డెమ్మను డబ్బులు అడుగుతున్నాడు. కాగా.. మంగళవారం సాయంత్రం సమయంలో వీరి ఇంటికి వచ్చాడు. అయితే అనంత ఒంటరిగా ఉండడంతో ఆమె గొంతు నులిమి హతమార్చాడు. అనంతరం ఆమె వద్ద ఉన్న బంగారం తీసుకుని పారిపోయాడు. కాగా.. మృతురాలి తల్లి బొడ్డెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒక్కరికి జైలు శిక్ష

**అక్షరటుడే, ఇందల్వాయి:** డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికిన ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఇందల్వాయి ఎస్సై సందీప్ తెలిపారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలానికి చెందిన దేవసూత్ విజయ్ కుమార్ రెండు రోజుల క్రితం ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. అతడిని నేడు కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. మరో వ్యక్తికి రూ.10 వే జరిమానా విధించినట్లు తెలిపారు. ఎవరైనా తాగి వాహనాన్ని నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.